నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 31 మే 2025 | MAHABUBNAGAR NARAYANPET

**పని చేయించుకోండి.. డబ్బులు ఇవ్వొద్దు**

కార్యాలయం సిబ్బందికి మీ పని చేయడానికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. కార్యాలయంలో ఏ అధికారి అయినా డబ్బుల కోసం ఇబ్బంది పెడితే.. తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటాం. ఈ మధ్యనే రికార్డ్‌ల వ్యవహారానికి సంబంధించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి మరోమారు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించాను. బాధితులు నన్ను ఆశ్రయిస్తే వారికి న్యాయం చేస్తాం

**-భూపాల్‌రెడ్డి, ధరూర్ తాసీల్దార్**



# పైసా వసూల్

- ధరూర్ తాసీల్దార్ ఆఫీస్‌లో పైకం చెల్లిస్తేనే పనులు
- లేదంటే ముందుకు కదలని ఫైల్స్
- కార్యాలయంలోని అధికారుల చేతివాటం
- నిర్మోహమాటంగా అడిగేస్తున్న వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

గద్వాల అర్బన్/ధరూర్, మే 30 : ఆ కార్యాలయంలో ఏ పనైనా.. సరే.. పైసలు పెట్టనిదే కాదు...పైకం చెల్లిస్తేనే...ఏ ఫైల్ అయినా కదిలేది..అన్న చందగా ఆ కార్యాలయంలో వ్యవహారాలు నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా నుంచి కూత వేటు దూరంలో ఉన్న ధరూర్ మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో పనిచేయాలంటే.. పైసలు తడపనిదే... అధికారులు ఏ ఫైల్ ముట్టరని తెలిసింది. అయితే ఈ మధ్యనే కొందరు రైతులు తమ వ్యవసాయ భూమికి సంబంధించి గత పాత వివరాలు సేకరించేందుకు కార్యాలయ అధికారికి దరఖాస్తు చేసుకున్నారు. అధికారి అనుమతి అనంతరం పాత వివరాల రికార్డ్‌ల ద్వారా సమాచారం సేకరించేందుకు రికార్డ్ రూం వెళ్లగా...తమకు పైకం చెల్లిస్తేనే...మీ పని త్వరగా అయిపోతుంది. లేదంటే కొంత సమయం పడుతుందని ప్రజలకు నిర్మోహమాటంగా చెప్పినట్లు సమాచారం. అలానే కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాల వ్యవహారంలో కూడా ఇదే తీరు ఉన్నట్లు బాహాటంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నిత్యం రూ.వేలల్లో..**

ప్రభుత్వం అర్హులకు రేషన్ కార్డులు అందజేస్తామని ప్రకటించింది. ఇదే అదునుగా భావించిన కార్యాలయ అధికారులు తమ జేబుకు పని చెప్పారు. రేషన్ కార్డు కావాలంటే రూ.200 నుంచి రూ.500 వరకు వసూలు, అలాగే పాత రేషన్ కార్డుల నుంచి పేరు తొలగించాలంటే రూ.100 నుంచి రూ.200 ప్రజల నుంచి వసూలు చేస్తున్నట్లు తెలిసింది. రేషన్ కార్డులు సరిచేసే ఆపరేటర్ రోజు ఆదాయం రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఉంటుందని కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు. కార్యాలయానికి సంబంధించి ప్రతి రోజూ అందరి అధికారులు రూ.30వేల నుంచి రూ.80వేల వరకు ప్రజల నుంచి వసూలు చేస్తున్నట్లు మండల కేంద్రంలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అలానే కార్యాలయంలో పైరవీకారుల వ్యవహారాలు కూడా అదే స్థాయిలో పైరవీలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైరవీకారులు తెచ్చే పంచాయితీలు అన్ని కూడా రూ. లక్షలతో కూడిన వ్యవహారాలు వస్తున్నట్లు తెలిసింది. వాటిని సెటిల్ చేస్తే అదే తరహాల్లో లక్షల్లో అధికారులకు ముట్టచెబుతున్నట్లు పెద్దమొత్తంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ఒక్క చోటే కాదు జిల్లాలోని పలు కార్యాలయాల్లో ఇదే తంతు ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల దోపిడీకి కార్యాలయానికి రావాలంటే సామాన్య ప్రజలు జంకుతున్నారు.



జోగుళాంబ గద్వాల జిల్లాలోని ధరూర్ తాసీల్దార్ కార్యాలయం



- అమాయక అన్నదాతలే టార్గెట్‌గా దళారులు
- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి
- రైతులకు నకిలీవి అంటగట్టే అవకాశం
- అంతంత మాత్రంగానే విజిలెన్స్ తనిఖీలు

# సీడ్ బీ కేర్‌ఫుల్

- విత్తన ప్యాకెట్ల కవర్లను జాగ్రత్త చేయాలి

రాజోళి, మే 30 : ఒక వైపు వానకాలం సీజన్ సమీపిస్తుండడం, మరోవైపు ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ముఖ్యంగా పంటల కోసం విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకునేందుకు ఎరువులు, విత్తనాల దుకాణాలకు పరుగులు పెడుతున్నారు. ఇదే అదునుగా భావించి కొంత మంది దళారులు తమ జేబులు నింపుకొనేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా రైతులకు విత్తనాల ఎంపికలో సరైన అవగాహన లేకపోవడంతో చాలా వరకు షాపు యజమానులపై ఆధారపడి వారిని నమ్మకమైన విత్తనాలు ఇవ్వాలని కోరుతుండడంతో వారు ఏ కంపెనీ పడితే ఆ కంపెనీకి చెందిన విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. దీంతో నకిలీ విత్తనాలు వేసుకొని సంవత్సరం పొడువుగా కష్టపడి పెట్టుబడులు పెట్టి చివరకు పంట పండక పీకలోతు కష్టాల్లో రైతులు మునిగిపోతున్నారు. రైతుల నిరక్షరాస్యతను ఆసరా చేసుకొని అసలుదు ఏదో.. నకిలీ ఏదో గుర్తుపట్టలేనంతగా కంపెనీలు రకరకాల వెరైటీలతో ప్యాకింగ్‌లు చేసి గుర్తింపున్న వెరైటీల పేర్లు చెబుతూ వ్యాపారులు నకిలీల విత్తనాలను అంటగట్టి మోసాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో కొంత మంది సీడ్ విత్తనాలు వేసిన వాటిని కంపెనీలకు ఇవ్వకుండా ఎలాంటి జీవో టీ టెస్టు చేయకుండా ప్యాకింగ్ చేసి రైతులకు కంపెనీ ధరలకు అమ్ముకుంటూ రైతులను నట్టేటా ముంచుతున్నారు. రైతులకు అండగా ఉండాల్సిన టాస్క్ ఫోర్స్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే రైతులు మోసపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయాధికారులు సైతం గ్రామాల్లో రైతులకు విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతోపాటు అసలు విత్తనాలు ఏవో.. నకిలీవి ఏవో గుర్తించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉన్నది.

**విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- రైతులు విత్తనాలు కొనేటప్పుడు ప్రభుత్వ అనుమతి పొందిన డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు తీసుకునేటప్పుడు సంబంధిత డీలర్ నుంచి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి
- విత్తనాల ప్యాకెట్‌పై కంపెనీ పేరు, సీల్, తయారు చేసిన తేదీ, గడువు ముగిసే తేదీ, తేమ శాతం తప్పనిసరిగా చూసుకోవాలి.
- పొలంలో విత్తనాలు వేసిన అనంతరం డీలర్ ఇచ్చిన రశీదు, విత్తనాల ప్యాకెట్‌కు సంబంధించిన కవర్లను పంటలు పూర్తయ్యేవరకు జాగ్రత్తగా దాచుకోవాలి.
- నకిలీ విత్తనాలు డీలర్ నుంచి కొనుగోలు చేసినట్లు అయితే చట్టం ప్రకారం పంటలు నష్టపోయిన రైతులు సంబంధిత కంపెనీ నుంచి పరిహారం పొందే అవకాశం ఉంటుంది.

# బీఆర్ఎస్ రజతోత్సవాన్ని సంబురంగా నిర్వహించాలి




మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న ఎన్ఆర్ఐ నాయకులు

- పదేండ్లలో ప్రపంచంలోనే తెలంగాణ నెంబర్‌వన్
- రాబోయే రోజుల్లో గులాబీ పార్టీదే హవా
- డాలస్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఘన స్వాగతం పలికిన ఎన్ఆర్ఐ నేతలు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 30 : అమెరికాలోని డాలస్ రాష్ట్రంలో ఎన్ఆర్ఐ నేతలు శుక్రవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం డాలస్‌లోని గాంధీ పార్క్ వద్ద నిర్వహించిన కారు ర్యాలీలో అచ్చంపేట్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి మాజీ మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న డాలస్‌లోని డీఆర్ పెప్పర్ అరేనా వేదికగా జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబురాలకు తెలంగాణకు చెందిన ఎన్ఆర్ఐలు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచంలోనే మంచి గుర్తింపు సాధించారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి ఎన్ఆర్ఐల సహకారం ఎంతో అవసరమని కోరారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ నాయకులు పాల్గొన్నారు.

# జూరాలకు వరద హోరు


- ఐదు గేట్ల ద్వారా నీటి విడుదల
- రాత్రి అన్ని గేట్ల మూసివేత

గద్వాల, మే 30 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద హోరు కొనసాగుతున్నది. వరద వస్తుండడంతో జూరాల కుడి కాల్వకు అధికారులు నీటిని విడుదల చేశారు. శుక్రవారం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 50వేల క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 46,737 క్యూసెక్కులుగా నమోదైంది. జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తికి 24,931 క్యూసెక్కులు, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 1,500 క్యూసెక్కులు, జూరాల కుడి కాల్వకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రం వరకు ఐదుగేట్లతో నీటి విడుదల కొనసాగగా, రాత్రికి మూసివేశారు.

**తుంగభద్ర, ఆర్డీఎస్‌కు వరద..**

అయిజ, మే 30 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు తుంగభద్ర ప్రాజెక్టుకు వరద చేరుతున్నది. శుక్రవారం డ్యాంలోకి ఇన్‌ఫ్లో 14,400 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 153 క్యూసెక్కులు నమోదైంది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం1633 అడుగులకు గానూ ప్రస్తుతం 1592.96 అడుగుల నీటి మట్టం ఉండగా, 100.855 నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 13.678 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 7,952 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 7,952 క్యూసెక్కులు నమోదుకాగా దిగువన ఉన్న సుంకేసుల బరాజ్‌కు 7,952 క్యూసెక్కులు చేరుతున్నది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.9 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది. ముందస్తు నీటి రాకతో రైతుల్లో ఆనందం వెల్లివిరిస్తున్నది.

జూరాల డ్యాం నుంచి విడుదలవుతున్న వరద



# తాగునీటి కోసం తండ్లాట

- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన తిమ్మారెడ్డిపల్లితండా వాసులు
- వారం రోజులుగా నీళ్లు రావడం లేదని ఆగ్రహం

ఊట్కూర్, మే 30 : మండలంలోని తిమ్మారెడ్డిపల్లితండాలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. తండాలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల నుంచి తండావాసులకు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరుబావులను ఆశ్రయిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు తాగునీటి సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ పొలాల నుంచి నీళ్లు తెచ్చుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కడివేడు నీటి కోసం కిలోమీటర్లు నడవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తండాలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మహిళల నిరసనకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు మద్దతు తెలిపారు.



తిమ్మారెడ్డిపల్లితండాలో ఖాళీ బిందెలు, బకెట్లతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న తండావాసులు

# కట్టుకున్నోడే.. కడతేర్చాడు

- అనుమానంతో భార్యను చంపిన భర్త
- పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లిలో ఘటన



ఎల్లమ్మ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, మే 30 : మండలంలోని గంట్రావుపల్లికి చెందిన నాగశేషుకు పదిహేనేండ్ల కిందట ఎల్లమ్మతో వివాహం జరిగింది. పదిహేనేండ్లు సవ్యంగా సాగిన వారికి సంసార జీవితంలో ఏడాది నుంచి కలహాలు మొదలయ్యాయి. ఎల్లమ్మ, నాగశేషు దంపతులకు ఇద్దరు మగపిల్లలు, ఒక కూతురు ఉన్నారు. ముఖ్యంగా నాగశేషుకి భార్యపై అనుమానం ఉండడంతో గురువారం రాత్రి భార్య ఎల్లమ్మ(40)తో గొడవపడి ఆమెను కిరాతంగా హత్య చేసి పోలీసులకు లొంగిపోయాడు. శుక్రవారం కొల్లాపూర్ సీఐ మహేశ్, పెద్దకొత్తపల్లి ఎస్సై సతీశ్ గ్రంటావుపల్లి గ్రామానికి చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి సోదరుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# విహారం.. విషాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- నిజాంపేటకు చెందిన తల్లీకూతుళ్ల మృతి
- మరో ఇద్దరికి గాయాలు

ఎర్రవల్లి చౌరస్తా, మే 29 : విహారయాత్ర విషాదంగా మారిన ఘటన ఎర్రవల్లి మండలం ఇటిక్యాల పీఎస్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు మేడ్చల్ జిల్లా నిజాంపేటకు చెందిన ఎర్ర వెంకటబాబ్జి(40) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆయన తన కుటుంబ సభ్యులు భార్య శ్రావణి(38), పిల్లలు సాయిచైత్ర(7), లక్ష్మీసహస్ర(11)తో కలిసి ఈ నెల 24వ తేదీన తన కారులో ఊటీకి విహారయాత్రకు వెళ్లారు. వారి యాత్ర ముగించుకొని తిరిగి వస్తుండగా శుక్రవారం తెల్లవారు జామున 6గంటల ప్రాంతంలో ఇటిక్యాల మండలం మునగాల శివారు దగ్గర జాతీయ రహదారిపై ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా సిమెంట్ లోడ్‌తో ఆగిఉన్న లారీని ఎర్ర వెంకటబాబ్జి కారు వెనుకనుంచి ఢీకొట్టగడంతో శ్రావణి అక్కడికక్కడే మృతిచెందింది. మిగిలిన ముగ్గురుకు తీవ్ర గాయాలు కాగా వారిని వెంటనే హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఓమిని దవాఖానకు తరలించగా కూతురు సాయిచైత్ర చికిత్స పొందుతూ మృతిచెందింది. తీవ్ర గాయాలైన లక్ష్మీసహస్త్రకు చికిత్స కొనసాగుతున్నది. రోడ్డుపై నిర్లక్ష్యంగా లారీని ఆపి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మల్లికార్జున్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు వెంకటబాబ్జీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

శ్రావణి, సాయిచైత్ర (ఫైల్)



# ఉడుముల వేట

- పట్టుబడిన నలుగురిపై కేసు నమోదు

లింగాల, మే 30 : ఉడుములను వేటాడిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో ఈశ్వర్ తెలిపారు. ఎఫ్ఆర్వో తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం పద్మన్నపల్లికి గ్రామానికి చెందిన కాట్రాజు రాజు, కాట్రాజు నిరంజన్, రాయ బాలయ్య, బల్మూరి లింగస్వామి గురువారం సమీపంలోని గుండాల ప్రాంతంలో ఉడుములను వేటాడి తీసుకుని వస్తుండగా ఆ ప్రాంతంలో విధులు నిర్వర్తిహిస్తున్న అటవీ సిబ్బంది రమేశ్‌కు తారసపడినట్లు తెలిపారు. ఆయన వెంటనే డీఆర్వో జయదేవ్‌కు సమాచారం ఇవ్వకుండా వెంటనే సిబ్బందితో వచ్చి తనిఖీలు చేయగా వారి వద్ద తొమ్మిది ఉడుములు దొరికాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకొని వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.



ఉడుములను వేటాడిన వ్యక్తులతో అటవీ అధికారులు

# వీధి కుక్కల స్వైరవిహారం

- జడ్చర్లలో పదిమందికి గాయాలు



కుక్క దాడిలో గాయాలైన చెయ్యి

జడ్చర్లటౌన్, మే30 : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీలో ఓ వీధి కుక్క కాటుతో పది మందికి గాయాలైన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. ఇందిరానగర్‌కాలనీ నుంచి వెంకటేశ్వరకాలనీ వరకు ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి అటుగా వచ్చిన చిన్నారులపై దాడి చేసింది. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులోని సత్యనారాయణస్వామి ఆలయం సమీపంలో కుక్క కాటుతో ఓ మహిళ గాయపడింది. వేర్వేరు కుక్కల దాడిలో పది మంది గాయపడి చికిత్స నిమిత్తం జడ్చర్ల ఏరియా దవాఖానకు రాగా వైద్యసిబ్బంది బాధితులకు వైద్య చికిత్సలు అందించారు. కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో కుక్కలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మాకు తెల్వకుండానే మా పొలాల్లోకి వస్తుండ్రు



మాజీ ఎమ్మెల్యే చిట్టెంతో సమావేశమైన కాట్రేవుపల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు

- మక్తల్‌లో చిట్టెం ఎదుట వాపోయిన కాట్రేవుపల్లివాసులు
- రైతులకు పరిహారం ప్రకటించాకే భూసేకరణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్

మక్తల్, మే 30 : వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమకు కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం పెద్ద శాపంగా మారిందని, ఎత్తిపోతల పథకానికి భూములు ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారులు ఒక వైపు, పోలీసులు మరో వైపు ఇబ్బందులు పెడుతున్నారని భూ నిర్వాసితులు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితో గోడు వెల్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో ముందుగా రైతుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే భూసేకరణ చేపట్టాలని, ఇందుకోసం రెవెన్యూ అధికారులు, పోలీసులను రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ముందుగా రైతులు కోరుతున్న నష్టపరిహారం విషయంలో ప్రభుత్వ స్పష్టమైన హామీ ఇవ్వకుండా భూ సేకరణ చేపడితే ఎలా అని ప్రశ్నించారు. ఎత్తిపోతల పథకానికి కృష్ణా బోర్డు నుంచి అనుమతులు రావాల్సి ఉందని, అనుమతులు వచ్చిన తర్వాతే ఏ పనులు చేపట్టడానికైనా అధికారులు ముందు వస్తే బాగుంటుందన్నారు. రైతులకు తెలియకుండా రెవెన్యూ అధికారులు వారి పొలాలకు వెళ్లరాదని పేర్కొన్నారు. రైతుల నిర్ణయాన్ని కాదని వారిని ఇబ్బందులు పాలు చేసినా, వారి నుంచి బలవంతంగా భూములు లాక్కోవాలని చూసినా బీఆర్ఎస్ రైతులతో కలిసి పోరాడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాట్రేవుపల్లికి చెందిన రైతులు రాజు, శ్రీనివాస్‌గౌడ్, రవికుమార్‌తోపాటు పలువురు రైతులు ఉన్నారు.

# పార్టీ కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే



కార్యకర్త పాడె మోస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, మే 30 : అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు ఊపిరున్నంతవరకు అండగా ఉంటానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం ఉండవెల్లి మండలం పుల్లూరులో బీఆర్ఎస్ కార్యకర్త కోడేదూడ చిన్న వెంకటన్న అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి భౌతికకాయానికి నివాళుర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొని వెంకటన్న పాడె మోశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ చిన్న వెంకటన్న బీఆర్ఎస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించారని, ఆయన మన మధ్యలేకపోవడం చాలా బాధకరమన్నారు. ప్రజలు, కార్యకర్తలు ఏ ఆపద వచ్చినా తనను సంప్రదించవచ్చని ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# ఉద్యోగ కల.. కలగానే..

- జాబ్ రాదన్న కలతతో అనారోగ్యంపాలు
- కొలువులో చేరకుండానే మృతి చెందిన శ్రీశైలం ముంపు నిర్వాసితుడు



రాఘవేందర్‌గౌడ్ (ఫైల్)

పెబ్బేరు, మే 30 : తమ ఉద్యోగం కల తీరక ముందే శ్రీశైలం నిర్వాసితులు అసువులుబాస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో ఆస్తులు కోల్పోయిన కుటుంబాలకు 98 జీవో ప్రకారం ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలన్న నిబంధన ఉన్నప్పటికీ అది అమలు కావడం లేదు. 40 ఏండ్లుగా నిర్వాసితులు ఇందుకోసం పోరాడుతూనే ఉన్నారు. ఉద్యోగం కోసం ఎదురు చూసి మధ్యలోనే కొందరు మరణిస్తున్నారు. పెబ్బేరు మండలం గుమ్మడంలో కూడా శుక్రవారం సురగాని రాఘవేందర్‌గౌడ్(45) అనే శ్రీశైలం నిర్వాసితుడు అనారోగ్యంతో తనువు చాలించాడు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల నాయకులు వచ్చి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తాము చనిపోకముందే ఉద్యోగాలు కల్పించాలని డాగోజీరావు, గోవిందు, పురుషోత్తం తదితరులు డిమాండ్ చేశారు.